క్లుప్తంగా

తాగునీటి బోరు ఏర్పాటు



పూజ చేస్తున్న 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీలో సుమారు 200 కుటుంబాలకు మంచి నీటి కష్టాలు తొలగే విధంగా మంగళవారం నూతనంగా తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. ఈ పనులను కార్పొరేటర్ గుండపు నాగేశ్వర రావు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ గతంలో బోరు కాలుష్యం అవడంతో డమ్మీ చేయడం వల్ల పరిసర ప్రాంత ప్రజలు మంచినీటికి ఇబ్బందులు పడేవారన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి నూతన తాగునీటి బోరు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. దీంతో స్థానికులు కార్పొరేటర్ నాగేశ్వరరావుకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

200 మందికి వైద్య పరీక్షలు



వైద్యులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ చిన్నా

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవలో వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి, డీఎంహెచ్‌వో సహకారంతో కార్పొరేటర్ గల్లా చిన్నా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు గూడెల కృష్ణ, జెర్రిపోతుల నర్సింగరావు, పుక్కల కృష్ణ, నాగరాజు, కరణం శ్రీను, నరేన్, సతీష్ పాల్గొన్నారు.

యాచకుడి ఆచూకీ తెలపండి



యాచకుడు అప్పారావు

గోపాలపట్నం: కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న యాచకుడు అప్పారావు పూర్తి వివరాలు తెలియజేయాలని ఎయిర్‌పోర్టు పోలీసులు కోరుతున్నారు. ఈ నెల 1న హెల్పింగ్ హెల్ప్‌లెస్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు కాకానినగర్ వద్ద గ్రీన్ బెల్ట్‌లో వర్షంలో అచేతనంగా ఉన్న అప్పారావు అనే యాచకుడ్ని కేజీహెచ్‌లో చేర్పించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అప్పారావును గుర్తించిన వారు పూర్తి వివరాలు ఎయిర్‌పోర్టు పోలీసులకు సమాచామివ్వాలని కోరారు.

తీరంలో 'సుందరకాండ' సందడి



లొకేషన్‌లో నటుడు నారా రోహిత్

కొమ్మాది: భీమిలి – ఆర్‌కే బీచ్ తీర ప్రాంతాల్లో మంగళవారం షూటింగ్ సందడి నెలకొంది. సందీప్ పిక్చర్ ప్యాలస్ బ్యానర్‌పై నిమ్మలపూడి వెంకటేష్ దర్శకత్వం వహిస్తున్న సుందరకాండ అనే సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. నటుడు నారా రోహిత్ హీరోగా తెరకెక్కిస్తున్న ఈ సినిమాకు చిన్నపాల్ల సంతోష్, గౌతమ్‌రెడ్డి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

ఆహ్లాదానికి చోటేది?



పార్కు ఆవరణలో వేసిన చెట్టు కొమ్మలు

- నిర్వహణ లేక అధ్వానంగా చిల్డ్రన్ పార్కు
- తుప్పు పట్టిన ఆట వస్తువులు
- పిచ్చి మొక్కలు,తుప్పలతో కళావిహీనం

మల్కాపురం: ఆ పార్కు ఆవరణ చిన్నారుల ఆటలతో సందడిగా ఉండేది. నేడు పిచ్చి మొక్కలు,ఎండిన మొక్కలు కొమ్మలు,తుప్పు పట్టి ఆట పరికరాలతో కళాహీనంగా మారింది. దీని ఆలనాపాలన చూసే నాథుడు లేకపోవడం వల్లే అధ్వానంగా మారిందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం కాలనీలో కాలనీ వాసులతో పాటు పిల్లల కోసం సుమారు 10 సెంట్ల విస్తీర్ణంలో 2017లో అందమైన చిల్డ్రన్ పార్కు నిర్మించారు. ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కాలనీ పరిధిలోని చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు వచ్చి ఉత్సాహంగా గడిపేవారు. పిల్లలు ఆట పరికరాలతో సందడి చేస్తే తల్లి దండ్రులు వ్యాయామం చేసేవారు. పెద్దలు ఇక్కడి బెంచీలపై కాలక్షేపం చేసేవారు. ఇలా పలకరింపులు సరదా కబుర్లు చెప్పుకునే వారితో పార్కు అంతా సందడిగా ఉండేది.

ఆకట్టుకునేలా వాతావరణం

పార్కులో సాయంత్రం సమయంలో అడుగు పెడితే ఆవరణ అంతా పచ్చదనం,అందమైన మొక్కలు,అధునాత విద్యుత్ వెలుగులతో ఆకట్టుకునేది. పార్కుకు వచ్చే వారు ఉల్లాసంగా గడిపేవారు. నేడు దీని ఆలనాపాలనా పట్టించుకునే వారు లేకపోవడంతో పార్కు ముఖ ద్వారంలో ఏర్పాటు చేసిన ఇనుప గేటు ఎవరో ఎత్తుకెళ్లిపోయారు. పార్కులో ఏర్పాటు చేసిన పిల్లల ఆట వస్తువులు పూర్తిగా తుప్పు పట్టి ఉన్నాయి. పార్కు ఆవరణ అంతా పిచ్చి మొక్కలు,ఎండిన చెట్టు కొమ్మలతో దర్శనమిస్తోంది. దీంతో కాలనీ వాసులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

ఆకతాయిల అడ్డాగా..

పార్కు కళా విహీనంగా మారడంతో పిల్లలు రావడం మానేశారు. దీంతో ఆకతాయిలు తమ అడ్డాగా మార్చుకున్నారు. చీకటి పడిన తర్వాత కొంత మంది ఆకతాయిలు పార్కులోకి ప్రవేశించి మద్యం,ధూమపానం వంటివి చేస్తున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి పార్కుకు పూర్వ వైభవం తీసుకురావాలని వారు కోరుతున్నారు.

అసౌకర్యంగా ఉంది



నాడు పార్కులోకి ప్రవేశిస్తే **ఎంతో ఆహ్లాద**ంగా **ఉండేది. నేడు** చాలా **ఇబ్బంది కరంగా** ఉంది.**మా కాలనీ పిల్లలు** ఆడు**కోవడానికి సరైన పా**ర్కు లేకపోయింది. దీంతో **రోడ్లపైకి వచ్చి ఆడు**కోవాల్సిన పరిస్థితి కలుగు**తుంది.అధికారులు** స్పందించి పార్కును అభివృద్ధి చేయాలి.

– సాంబశివరావు, కాలనీ వాసి

ఆకతాయిల బెడద



పార్కు ప్రస్తుతం కళాహీనంగా మారింది. ఆకతాయిలతో పాటు రాత్రి సమయంలో కొంత మంది కుర్రోళ్లు చేరి మద్యం,ధూమపానం వంటివి చేస్తున్నారు.దీన్ని ఇలాగే వదిలేస్తే భవిష్యత్‌లో మరింత ఇబ్బంది కరంగా మారుతుంది. అధికారులు స్పందించి అభివృద్ధి చేయాలి.

– హరీష్‌కుమార్, కాలనీ వాసి



తుప్పు పట్టిన పిల్లల ఆట వస్తువులు



పార్కు ముఖద్వారంలో గేటు లేక అడ్డుపెట్టిన చెట్టు కొమ్మలు

నేడు విజయోత్సవ సభ

సింథియా: ఇండియన్ నేవీ సివిలియన్‌మజ్దూర్ సంఘం ఇటీవల జరిగిన గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సందర్భంగా బుధవారం విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ ప్రధాన కార్యదర్శి ఎస్.రాజేష్ తెలిపారు. 104 ఏరియా సమీపంలోని మేఘాద్రిపేట డిఫెన్స్ సివిలియన్‌కాలనీలో గల కళా మేఘ ఆడిటోరియంలో జరగనున్న సభకు ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే గణబాబు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, అఖిల భారత డిఫెన్స్ మజ్దూర్ సంఘం ప్రతినిధులు హాజరావుతారని నిర్వాహకులు తెలిపారు.

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌ను కలిసిన శ్రీధర్



కమిషనర్ విశ్వనాథన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న శ్రీధర్

విశాఖ విద్య: వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌ను మంగళవారం నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మర్యాద పూర్వకంగా కలిశారు. నగరంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వీఎంఆర్‌డీఏ ద్వారా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. నగర అభివృద్ధిలో వీఎంఆర్‌డీఏ పాత్ర ఎంతో కీలకమని, కమిషనర్‌గా ప్రత్యేక చొరవ చూపుతారనే నమ్మకం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 52వ వార్డులో చేపట్టాల్సిన పనులపై ఈ సందర్భంగా చర్చించారు.

సీజనల్ వ్యాధుల కట్టడిపై దృష్టి

- ఏడీసీ రమణమూర్తి
- 60వ వార్డులో విస్తృత పర్యటన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి

మల్కాపురం: సీజనల్ వ్యాధుల కట్టడికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్టు జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి చెప్పారు. జీవీఎంసీ 60వ వార్డు పరిధిలోని జనతాకాలనీలో మంగళవారం ఏడీసీ పర్యటించి జ్వర పీడితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి ప్రాణాంతక వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వర్షాలు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి శుక్రవారం, మంగళవారం ఇంట్లో అత్యవసరానికి కావాల్సిన నీటిని ఉంచుకుని, మిగిలిన నీటి పాత్రలను ఖాళీ చేయాలన్నారు. తద్వారా సీజనల్ వ్యాధుల కారక దోమల నుంచి రక్షణ పొందవచ్చునని చెప్పారు. ప్రజలు వ్యర్థాలను తడి-పొడి చెత్తగా ఇంటి వద్దే వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధులను అరికట్టవచ్చునని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉంచకుండా జాగ్రత్త వహించాలన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎలాంటి అనారోగ్య సమస్య తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినట్టు చెప్పారు. కార్యక్రమంలో బయాలజిస్ట్ దాడి సాంబమూర్తి, మల్కాపురం మలేరియా నివారణ సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, ఇతర మలేరియా సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

శరవేగంగా 'అయోధ్య రామాలయం సెట్'



తుదిమెరుగులు దిద్దుకుంటున్న అయోధ్య రామాలయం సెట్

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ మరో వినూత్న కార్యక్రమానికి వేదికగా నిలవనుంది. ఈ ఏడాది వినాయక చవితి వేడుకల్లో భాగంగా యూత్ ఐకాన్ సంస్థ ఎంవీపీ కాలనీలో అయోధ్య రామాలయం సెట్‌ను నిర్మించి అక్కడ బాల గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించనుంది. గత ఏడాది ఇదే సంస్థ ఆర్కేబీచ్‌లో చాక్లెట్ వినాయకుడి ప్రతిమను ఏర్పాటు చేసి చవితి పూజలు నిర్వహించిన విషయం తెలిసిందే. దీనికి నగర వాసుల నుంచి విశేష ఆదరణ లభించిన నేపథ్యంలో ఈ ఏడాది ఎంవీపీ కాలనీలో అయోధ్యలోని రామ మందిరం నమూనాతో ప్రత్యేక సెట్ నిర్మిస్తోంది. అక్కడ బాల గణపతితో పాటు మట్టి వినాయకుడి భారీ ప్రతిమను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించనున్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి పూజలు ప్రారంభం కానున్నట్లు యూత్ ఐకాన్ ప్రతినిధి కనకరాజు వెల్లడించారు.

అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలి



వాల్తేర్ డిపో నుంచి పెదవాల్తేర్ వరకు ర్యాలీ చేస్తున్న ఉద్యోగులు

ఎంవీపీకాలనీ: వాల్తేర్ ఆర్టీసీ డిపో మేనేజర్, యాజమాన్యం తీరును నిరసిస్తూ ఆ డిపో ఉద్యోగులు మంగళవారం నిరసన బాటపట్టారు. యాజమాన్యం తీరుకు నిరసనగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ వాల్తేర్ డిపో నుంచి పెదవాల్తేర్ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ విశాఖ జిల్లా వాల్తేర్ డిపో కార్యదర్శి వసంతరావు మాట్లాడుతూ వాల్తేర్ డిపో పరిధిలోని కండక్టర్‌ను అక్రమంగా సస్పెండ్ చేశారన్నారు. ఉద్యోగి సెస్పెన్షన్, డిపో యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకిస్తూ గత కొన్ని రోజులుగా నిరసనలు చేస్తున్నట్లు తెలిపారు. వాల్తేర్ డిపో మేనేజర్‌పై తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే శుక్రవారం నుంచి ఉద్యోగులంతా నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో దీక్షకు దిగనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పీవీవీ మోహన్, జీఆర్ రావు, ఎంవీఆర్ మూర్తి, బి.నీలకంఠం తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు హాజరయ్యారు.

దళారీ వ్యవస్థతో కాంట్రాక్టు కార్మికులకు నష్టం



కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నాలో పాల్గొన్న కాంట్రాక్ట్ వర్కర్లు

సీతంపేట : దళారీల చేతిలో నలిగిపోతూ ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య కళాశాలల్లో వెట్టి చాకిరీ చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్, సెక్యూరిటీ కాంట్రాక్టు వర్కర్లకు పెరిగిన వేతనాలు చెల్లించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూడోట ప్రకాష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో గల కార్మిక శాఖ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రుల్లో ఉన్న రోగులకు ఇబ్బంది కలగకుండా సేవలందిస్తున్న సిబ్బందిని దళారీ వ్యవస్థలో పెట్టి అన్యాయం చేస్తున్నారన్నారు. పెరిగిన జీతాలు ఇవ్వకుండా, పీఎఫ్ డబ్బులు, ఈఎస్‌ఐ కార్డులు ఇవ్వకుండా వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన 549, 43 జీవోల ప్రకారం పెరిగిన వేతనాలు చెల్లించాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు బుగత అశోక్ మాట్లాడుతూ ఇటీవల కాంట్రాక్టరు మారిన తర్వాత 38 నెలల నుంచి పీఎఫ్ ఎంత జమ అవుతోంది, ఎంత కటింగ్ చేస్తున్నారో చెప్పడం లేదన్నారు. యూనియన్ నాయకులు జి.వామన మూర్తి, ఆర్.వి.ఎస్.కుమార్,లక్ష్మణ పాల్గొన్నారు.

దేశ భాషలందు తెలుగు లెస్స

- ఎమ్మెల్సీ రఘువర్మ, ఎమ్మెల్యే గణబాబు
- గోపాలపట్నం హైస్కూల్‌లో ఘనంగా తెలుగుభాషా దినోత్సవం
- విద్యార్థుల నృత్య, నాటిక ప్రదర్శనలు



అష్టావధాన ప్రక్రియపై విద్యార్థుల ప్రదర్శన



తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే గణబాబు




తెలుగు సాహిత్య కారులను గుర్తు చేస్తూ విద్యార్థుల నృత్య ప్రదర్శన

గోపాలపట్నం: దేశ భాషలందు తెలుగు భాష లెస్స అని శ్రీకృష్ణ దేవరాయులే కీర్తించారని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం రాష్ట్రీయ ఉపాధ్యాయ తెలుగు పండిత పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు విద్యార్థులు నృత్య, నాటికలు ప్రదర్శనలు చూపరులను కట్టి పడేశాయి. తెలుభాష ఔన్నత్యాన్ని వివరిస్తూ వీరు చేసిన ప్రదర్శనలు, అవధానాలు, తెలుగుభాష కోసం ప్రముఖులు చేసిన కృషిని వర్ణిస్తూ పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. తెలుగు ఉపాధ్యాయులు ప్రదర్శించిన బోధన పరికరాల ప్రదర్శన ఆలోచింపజేసింది. అనంతరం సభా ప్రాంగణంలోని తెలుగు తల్లి, గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటాలకు మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘువర్మ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి పాఠ్య పుస్తకాలతో పాటు ఎంతో మంది మహా రచయితలు రాసిన సాహిత్యాన్ని చదవడం అలవర్చుకోవాలన్నారు. ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ తెలుగు భాష పై మక్కువతో చదవాలని విద్యార్థులను కోరారు. గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగు భాషాభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. డీఈవో చంద్రకళ మాట్లాడుతూ తెలుగుభాషపై అంతా మక్కువ పెంచుకుని చదవడం అలవాటు చేసుకోవాలని కోరారు. ఆర్జేడీ విజయభాస్కర్ మాట్లాడుతూ తెలుగుభాష తేనె కంటే మధురమైనదన్నారు. మీగడ రామలింగ స్వామి మాట్లాడుతూ తెలుగు భాషలో పద్యం, వచనం, గీతం వంటి ఎన్నో ప్రక్రియలు ఉన్నాయని.. ఇన్ని ప్రక్రియలు ఏ భాషలో లేవని తెలిపారు. అందుకే తెలుగు భాష విశ్వభాలకంటే గొప్పదని అభివర్ణించారు. ఈ సందర్భంగా వ్యాస రచన, పద్యపఠనం, నృత్యం, నాటికల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలోమాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, మాణిక్యాల నాయుడు, శ్రీనివాస్, గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల రావు, పలుపాఠశాలల తెలుగు పండితులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు



రామాయణ విశేషాలను తెలిపే బోధన సామగ్రి ప్రదర్శన

డెంగ్యూ జ్వరబాధితుడ్ని పరామర్శించిన డీఎంహెచ్‌వో



చైతన్యనగర్ కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మద్దిలపాలెం: ఇంటి పరిసరాల పరిశుభ్రతతోపాటు, నీటి నిల్వలను ఎప్పటిప్పుడు తొలగించుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్. జగదీశ్వర రావు అన్నారు. జీవీఎంసీ 23వ వార్డులో చైతన్యనగర్‌లో మంగళవారం నమోదైన డెంగ్యూ కేసుకు సంబంధించి, జ్వరబాధుడ్ని ఆయన పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన క్షేత్ర పర్యటన చేశారు. ఆయన మాట్లాడుతూ వారం పైబడి నీటి నిల్వలుంటే దోమల ఉత్పత్తికి ఆవాసాలు మారతాయన్నారు. జ్వరం వస్తే వెంటనే దగ్గరలో పట్టణ ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా విభాగం సూపర్‌వైజర్ వైఎస్ రత్నంపుట్టి , కోట్ని శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు కృష్ణాష్టమి ముగింపు వేడుకలు



శ్రీకృష్ణుని రథం వద్ద ఉత్సవ కమిటీ ప్రతినిధులు

తగరపువలస: దేశంలో మొదటి వీధి ఉత్సవం శ్రీకృష్ణాష్టమి అని త్రైత సిద్ధాంత భగవద్గీత ఆచార్య ప్రబోధ యోగీశ్వరస్వామి సేవాసమితి తాటితూరు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బోని రావణ అక్షయ్ అన్నారు. మంగళవారం స్థానిక తాటితూరు కూడలి మండపం శ్రీకృష్ణుని పల్లకి వద్ద ఆయన శ్రీకృష్ణాష్టమి విశిష్టతను తెలియ చేశారు. శ్రీకృష్ణుడు చనిపోయిన రెండేళ్లకు కలియుగం ప్రారంభమైందన్నారు. భగవద్గీత పుట్టిన తరువాత శ్రీకృష్ణుడు సామాన్య మనిషి కాదని జ్ఞానులు గ్రహించారన్నారు. అప్పటి నుంచే శ్రీకృష్ణాష్టమి వేడుకలు ప్రారంభించారన్నారు. ఈ నెల 5న అంగరంగ వైభవంగా ఊరేగింపుతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో దేవీ ప్రసాద్, ఆదినారాయణ, బాలకృష్ణ, అప్పలనరసమ్మ, ఆదమ్మ తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపు వర్కర్లను కొనసాగించాలి

తగరపువలస: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విధులు నిర్వర్తిస్తున్న వారిని కొనసాగించాలని ఏపీ లిక్కర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సుధాకర్ డిమాండ్ చేశారు. ఆనందపురం మండలం వెల్లంకిలో మంగళవారం జరిగిన విశాఖ జిల్లా మద్యం దుకాణాల నిరుద్యోగ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరూ నిరుత్సాహ పడవద్దని ప్రభుత్వానికి సమస్యలు తెలిసేలా పోరాటం చేస్తామన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఇది రాష్ట్రంలో 1.75 లక్షల కార్మికుల సమస్య అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పాలకొల్లు కమల్, రాష్ట్ర నాయకులు కె.సుధాకర్, ఎండీ ఇస్మాయిల్ ఖాన్, కె.చంద్రరావు, కె.శ్రీనివాస్, తాతాజీ, భరత్, భవానీ శంకర్, జగన్, అంబేద్కర్, భాస్కర్, చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై కరపత్రాల పంపిణీ



నేత్రదానం ఆవశ్యకతను వివరిస్తున్న సురేష్

సీతంపేట : జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ వి.మీనాక్షి ఆధ్వర్యంలో మంగళవారం అక్కయ్యపాలెంలోని జ్ఞానకేతన్ స్కూల్‌లో నేత్రదానంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల పారామెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్లు ఆర్.సురేష్, కె.అనిత పాఠశాలలో 9, 10 తరగతి విద్యార్థులకు నేత్రదాన ఆవశ్యకత వివరించారు. అనంతరం కరపత్రాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా నేత్రదాన ఆవశ్యకతపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పక్షోత్సవాల ముగింపు సభలో విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ సునీత, హెచ్‌ఎం పి.సురేష్‌కుమార్, గణేష్ పాల్గొన్నారు.